కొర్రమీను@600

మృగశిర కార్తెతో చేపలకు ఫుల్ డిమాండ్

- ఉదయం నుంచే కిటకిటలాడిన దుకాణాలు
- రూ. ఆరు వందలకు చేరిన నాటుకోడి మాంసం

షాద్‌నగర్‌టౌన్ : పట్టణంలోని పరిగి రోడ్డులోని మార్కెట్లో చేపలను కొంటున్న ప్రజలు

కడ్తాల్ : మండల కేంద్రంలో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

షాద్‌నగర్ టౌన్/చేవెళ్లటౌన్/కడ్తాల్, జూన్ 8 : మృగశిర కార్తె సందర్భంగా చేపల మార్కెట్లు జనాలతో సందడిగా మారాయి. ఉదయం నుంచే కొనుగోలుదారులతో చేపలు, మాంసం మార్కెట్లు కిటకిటలాడాయి. ఈ కార్తె ఆరంభం రోజున చేపలను తింటే ఉబ్బసంతోపాటు పలు రకాల రోగాలు దరిచేరవని ప్రజల నమ్మకం. దీంతో ప్రజలు వాటిని అధికంగా కొంటారు. సాధారణ రోజుల్లో విక్రయించే ధరలకంటే వ్యాపారులు ఈ రోజున ధరలు పెంచి విక్రయించారు. వినియోగదారులు ఎక్కువగా లైవ్‌ఫిష్‌లను కొనేందుకే ఇష్టపడ్డారు. కొర్రమీను కేజీ రూ. 600, జెల్లలు రూ. 120-150, గ్యాస్‌కట్, రవ్వలు రూ.180, బొచ్చలు, బంగారు తీగలు, సిల్వర్, రూ.200, లైవ్ చేపలను రూ. 250 చొప్పున విక్రయించారు. కాగా శనివారం కావడంతో అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు పేర్కొన్నారు.

ధరలకు రెక్కలు..

మృగశిర కార్తె సందర్భంగా చేపలతోపాటు నాటుకోడి మాంసానికి భారీ డిమాండ్ ఉన్నది. షాద్‌నగర్ పట్టణంలో నాటుకోడి మాంసం కేజీ ధర రూ. 600 వరకు పలికింది. సాధారణ రోజుల్లో కిలో ధర రూ.400-450 ఉండగా.. శనివారం వ్యాపారులు ధరను పెంచినట్లు వినియోగదారులు వాపోయారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేవెళ్ల మండల కేంద్రంలో చేపలు, చికెన్, నాటుకోడి ధరలకు రెక్కలొచ్చాయి. చేపలు రూ.200 నుంచి రూ.250 పలుకగా, చికెన్ కిలో రూ.300, నాటుకోడి కిలో రూ.700 ధర పలికింది. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో శనివారం మృగశిర కార్తెను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని మాంసం దుకాణాలు కిటకిటలాడాయి. కొర్రమీను కిలో రూ.600, బంగారు తీగ, బొచ్చ, రవ్వ చేపలను రూ.200 వరకు అమ్మారు. అదేవిధంగా పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల వద్ద చేపలను కొనేందుకు ప్రజలు ఎగబడ్డారు.

బీఆర్ఎస్ అధినేతను కలిసిన స్థానిక నాయకులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తలకొండపల్లి జడ్పీటీసీ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. **-కడ్తాల్, జూన్ 8**



తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌ను శనివారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపు రం గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి లక్ష్మీనర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలని సూచించినట్లు ఆయన చెప్పారు.
-చేవెళ్ల రూరల్, జూన్ 8

పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతిని అందజేస్తున్న అధ్యాపకులు

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 8 : విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని వ్యాలీస్టేట్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృతికా సూత్రావే అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జాతీయస్థాయి ఆన్‌లైన్ ప్రాజెక్టు పోటీలు నిర్వహించారు. దీనికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 146 జట్లల్లో 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సుశిక్షితులైన, అనుభవం కలిగిన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్టులను ఎంపిక చేసి విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కోహ్లి, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సైనీ, కపిల్‌కుమార్, టీఎస్‌డెలివరీ మేనేజర్ క్యాప్ జెమినీ, సైబర్‌సెక్యూరిటీ మేనేజర్ అర్జున్, డైరెక్టర్ వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిబట్ల, జూన్ 8 : సొంత వారినే పట్టించుకోని ఈ రోజుల్లో తనకు ఎలాంటి సంబంధం లేని 20 మంది పేద విద్యార్థులు ప్రతిరోజూ బడికి వెళ్లేందుకు తన సొంత ఖర్చులతో విద్యాసంవత్సరం పూర్తి అయ్యేవరకు వాహనాన్ని ఏర్పాటు చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు ఓ ఎస్ఐ.
నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలంలోని కుదాబక్షిపల్లి గ్రామానికి చెందిన దూసరి కృష్ణయ్య రెండేండ్లుగా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా గతేడాది తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రాజీవ్‌గృహకల్పలో కమ్యూనిటీ పోలీస్ అవగాహన సదస్సు నిర్వహించేందుకు తన సిబ్బందితో కలిసి వెళ్లాడు. అక్కడ ఉన్న చిన్నారులు పాఠశాలలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటూ రోడ్లపై ఆడుతూ ఎస్ఐకి కనిపించారు. ఆ చిన్నారులను ఆరా తీయగా.. నాలుగు కిలోమీటర్ల దూరంలోని నాగార్జునసాగర్ హైవేపైన ఉన్న రాగన్నగూడ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలని..అయితే రాజీవ్‌గృహకల్ప నుంచి అక్కడికి వెళ్లేందుకు ఎలాంటి రవాణా సౌకర్యంలేదని.. ఇక్కడికి బస్సులు, ఆటోలు రావని వారు చెప్పారు. స్పందించిన ఆయన విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సంకల్పించి సొంత ఖర్చులతో వాహనాన్ని ఏర్పాటు చేశాడు. ప్రతిరోజూ ఉదయం రాజీవ్‌గృహకల్ప నుంచి ఆ 20 మంది విద్యార్థులను రాగన్నగూడలోని ప్రభుత్వ బడికి తీసుకెళ్లి సాయంత్రం సమయంలో మళ్లీ వారిని ఇంటి వద్ద విద్యాసంవత్సరం పూర్తి అయ్యేవరకు దింపేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఎస్ఐ తన వేతనం నుంచి ప్రతినెలా రూ. 7500 చొప్పున 12 నెలలకు మొత్తం రూ.90,000 వ్యాన్ నిర్వాహకుడికి చెల్లించాడు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఎస్ఐ కృష్ణయ్యను 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శనివారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఎస్ఐ చేస్తున్న సేవలను అభినందించారు. ప్రతి ఒక్కరూ ఎస్ఐ కృష్ణయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, ఏఎస్ఐలు యాదయ్య, నర్సింహ, శ్రీను, సిబ్బంది నిరంజన్, అంజి, వెంకటేశ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఐ కృష్ణయ్యను సన్మానిస్తున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

సేవకు దక్కిన సన్మానం

- పేద విద్యార్థులు బడికెళ్లేందుకు సొంత ఖర్చుతో వ్యాన్‌ను ఏర్పాటు చేసిన ఆదిబట్ల ఎస్ఐ
- విద్యాసంవత్సరం పూర్తయ్యేవరకు రూ.90,000 వెచ్చింపు
- అభిమానంతో ఎస్ఐని సన్మానించిన స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులు

జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి

సమయం, డబ్బు వృథా కాదు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి
- వికారాబాద్ జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్

వికారాబాద్, జూన్ 8 : రాజీ మార్గమే రాజ మార్గమని జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడడంతో సమయం, డబ్బు వృథా కాదని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించగా.. జిల్లాలో మొత్తం 2,652 కేసులు రాజీ అయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగ్గ కేసులు రాజీ చేసుకోకపోవడంతో కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్నాయన్నారు. ఒక్కొక్క కేసు పదేండ్ల వరకు నడుస్తున్నదన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రాజీపడదగ్గ కేసులు అనగా మోటర్ వెహికిల్ ప్రమాదాల కేసు లు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, భూతగాదాలు, భార్యాభర్తలు, చిన్న, చిన్న కొట్లాటలు, బ్యాంకు అప్పులు, చెక్ బౌన్స్ కేసు లు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ శీతల్, అదనపు న్యాయమూర్తి శ్రుతీధూత, జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ కయ్యుమ్, పబ్లిక్ ప్రసిక్యూటర్ రాజేశ్వర్, అన్వేశ్‌సింగ్, సమీనాబేగం, శంకరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు పార్థివదేహంపై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

రామోజీరావుకు ఘన నివాళి

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్, జూన్ 8 : ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మరణంపట్ల రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు సంతాపం తెలిపారు. శనివారం రామోజీ ఫిలింసిటీలో ఉన్న రామోజీరావు పార్థివదేహానికి ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, మండల పార్టీ అధ్యక్షులు బుగ్గ రాములు, కిషన్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామోజీరావు సేవలను వారు కొనియాడారు. రామోజీరావు మృతి చెందిన విష యం తెలుసుకుని ఇబ్రహీంపట్నం, నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, నెర్రపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించారు.

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ, తదితరులు

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ, జూన్ 8 : కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని రాజ్యసభసభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో 13 బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రివర్గంలో 50 శాతం బీసీలకు అవకాశం కల్పించి, తెలంగాణ రాష్ట్రం నుంచి ముగ్గురు బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, బీసీలంటే వాటాదారులని, దేశంలోని 80 కోట్ల మంది బీసీలకు రాజ్యాంగ పరమైన హక్కులను కల్పించకుండా కేంద్రం అణచివేస్తుందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నదని.. ఆ విధానాన్ని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్, రాజేందర్, అంజి, సురేశ్, నందగోపాల్, అనంతయ్య, రామకృష్ణ, ఉదయ్, రాజ్‌కుమార్, జయంతీగౌడ్, నిఖిల్, ప్రీతం పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి గోల్డ్ మెడల్

బంగారు పతకంతో విద్యార్థిని వైష్ణవి

మొయినాబాద్, జూన్ 8 : తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థిని వైష్ణవికి బంగారు పతకం వరించింది. ఆమె మండలంలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న చేవెళ్ల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. ఈ నెల 6, 7 తేదీల్లో హన్మకొండలో నిర్వహించిన పదోతెలంగాణ స్టేట్ యూత్ మీట్ అండర్-18 అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతి భ కనబర్చింది. 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఆమె గోల్డ్ మెడల్ సాధించడంతో రంగారెడ్డి, హైదరాబాద్ పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారిణి డాక్టర్ శారద, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, జూన్ 8: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. కాచిగూడలో శనివారం ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా పూర్తి చేసిన యువకులు ఈ నెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 78931 41797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించాలన్నారు.

టీ-వర్క్స్ సందర్శన

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): భౌతిక ఆవిష్కరణలకు కేంద్రమైన టీ-వర్క్స్‌ను వ్యాపారవేత్తల ఫోరమ్, విద్యాసంస్థల ప్రతినిధులు శనివారం సందర్శించారు. టీ-వర్క్స్ కేంద్రంగా జరుగుతున్న ఆవిష్కరణలపై నిర్వాహకులతో చర్చించారు. కొత్త ఆవిష్కరణలు చేయాలన్న ఆసక్తి ఉన్న వారికి టీ-వర్క్స్ కల్పిస్తున్న వనరులు, ఔత్సాహికుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు. కార్పొరేట్ కంపెనీల సహకారంతో ఆవిష్కరణలు చేయాలన్న ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించేందుకు టీ-వర్క్స్ వేదికగా ఉంటుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులు మొదలుకొని కళాశాలల విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం టీ-వర్క్స్‌లో చేరి తమ ఆలోచనలకు అనుగుణంగా వస్తువుల నమూనాలను తయారు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సీడీఎఫ్‌డీలో ప్లేస్‌మెంట్ కాన్క్లేవ్

సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ అనుబంధ సంస్థల్లో పీహెచ్‌డీ స్కాలర్లకు ఉద్యోగ అవకాశాలను కల్పించేలా ప్రత్యేక ప్లేస్‌మెంట్ కాన్క్లేవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్‌లో జరిగే కాంక్లేవ్‌లో పాల్గొనవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఐబీఆర్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కాన్క్లేవ్‌లో బయోటెక్నాలజీ, యానిమల్ బయా టెక్నాలజీ నిపుణులు, ఇండస్ట్రీ వర్గాలు, పరిశోధన సంస్థలు భాగస్వామ్యం అవుతుండగా, పీహెచ్‌డీ విద్యార్హతలతో ఉన్న వారికి మెరుగైన అవకాశాలను అందుకోవచ్చని చెబుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సిటీ సివిల్‌కోర్టు జడ్జి సాయికిరణ్, రాపోలు భాస్కర్

సైదాబాద్, జూన్ 8: జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులంతా ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అయ్యడపు రవీందర్ రెడ్డి, సిటీ సివిల్‌కోర్టు జడ్జి సాయికిరణ్ అన్నారు. రాపోలు రామలక్ష్మి - రాములు జ్ఞాపకార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఉచితంగా శిక్షణ తరగతులు అందిస్తున్నారు. గడ్డి అన్నారం కల్యాణ్‌నగర్‌లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి రవీందర్‌రెడ్డి, సాయికిరణ్ ముఖ్య అతిథులుగా శనివారం విచ్చేసి శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. కఠోర శ్రమ నిర్దిష్ట లక్ష్యం, పట్టుదలతో పోటీ పరీక్షలు రాస్తే విజయం సాధించడం ఖాయమని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలకు తక్కువ రోజులే ఉన్నాయని అందుకు అభ్యర్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇటువంటి అవకాశం ఎంతోగానో దోహదపడుతుందన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ, జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలకు హాజరయ్యే వెనుకబడిన అభ్యర్థులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ తరగతులను నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు భార్గవ్, సునీల్ గౌడ్, రంగయ్య, శంకర్, విష్ణు, శ్రీధర్, ప్రభాకర్, కొమరయ్య పాల్గొని ప్రసంగించారు.

బహుజనులు ఐక్యంగా పోరాడాలి

ధిక్కార కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, జూన్ 8: బహుజనులు ఐక్యంగా పోరాడాలని, అప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతికశాఖ, నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో వెలువడిన 'ధిక్కార' కవితా సంకలనాన్ని జూలూరు గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ చరిత్రలో ఇంత గొప్ప పుస్తకం తెచ్చినందుకు రచయితలను అభినందించారు. బహుజనుల చైతన్య పతాకాలుగా సంకలనంలో కవిత్వాలు ఉన్నాయన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న బీసీలను దామాషా ప్రకారం, వారికి రావలసిన రాజ్యాధికారం రావడంలేదని విమర్శించారు. బహుజనుల కోసం ధిక్కార స్వరంతో ఉద్యమించాలని సంఘటితంగా సమైక్యమై ఒకే వేదికగా ఉద్యమించాలని, ఆ సమయం ఆసన్నమైందని, ఐక్యంగా పోరాడితే విజయం సాధిస్తామని బీసీలకు న్యాయం చేద్దామని జూలూరు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ, దేశంలో బహుజనుల చైతన్యం అవసరమన్నారు. కులగణన చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పాలక వర్గాల కుట్రలు తెలుసుకొని బహుజనులు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, కాశన్న, దినకర వెంకట్ పవార్ ఖాజా పాల్గొన్నారు.

'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8: తెలంగాణ విద్యార్థి ఉద్యమం ప్రపంచం గర్వించదగినదని ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. నలమాస కృష్ణ రచించిన 'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడారు. అనంతరం ప్రొఫెసర్ కాశీం మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేశ్ నాయక్, గాలి వినోద్ కుమార్, నసుమాస స్వామి, విద్యార్థి నాయకులు మాందాల భాస్కర్, డేవిడ్, అరుణాంక్ లత, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్, దరువు ఎల్లన్న, స్టాలిన్, కంచర్ల బద్రి, నెల్లి సత్య, మోహన్ ధరావత్ పాల్గొన్నారు.